https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 98 శనివారం 15-08-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## వివాదాల్లేని భూములను..
# 22ఏ నుంచి తొలగిస్తాం

**జిల్లా కలెక్టర్లకు, రిజిస్ట్రార్లకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం**

**ఎవరి భూమి ఎక్కడికీ పోదు.. ఆందోళన వద్దు**

**క్యూర్ పరిధిలో ఈవీలుగా ఆటోల మార్పు**

**ఆటోకు రూ.లక్షన్నర సబ్సిడీ.. 200 కోట్లతో పథకం**

**నేడు రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ**

**ఏడు రకాల సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లింపు**

**హిల్ట్ పాలసీ దరఖాస్తులకు మరో 3 నెలల గడువు**

**మరో 7 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లు**

**క్యాబినెట్ భేటీ నిర్ణయాలను వెల్లడించిన పొంగులేటి**



**హైదరాబాద్, ఆగస్టు 14**
వివాదాల్లేని ఆస్తులు/భూములు నిషేధిత జాబితా (22ఏ)లో ఉంటే.. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు, రిజిస్ట్రార్‌లకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని రెవె న్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములు/స్థలాలు కాకపోతే, ఆ భూములపై న్యాయస్థానాల్లో వివాదాలు లేకపోతే.. వాటిని నిరభ్యంతరంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు అనుమతించాల్సిందిగా నిర్దేశించామన్నారు. ఒక్క అంగుళం భూమి కూడా ఎక్కడికీ పోదని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. 22ఏ జాబితాకు సంబంధించి ఏదైనా అంశం మీడియా దృష్టికి వస్తే.. తన నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని, గంటలోపే స్పందిస్తానని అన్నారు. ఇప్పటికే కోర్ ఏరియా పరిధిలోని 46 మంది సబ్ రిజిస్ట్రార్‌లను ఆదేశాలు ఇచ్చామన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ, క్యూర్ పరిధిలో ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం, సన్నవడ్లకు బోనస్ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. పంద్రాగస్టు రోజు మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 3.43 లక్షల కుటుంబాలకు ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతేడాది డిసెంబరులో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించినట్లుగానే ఈ ఏడాది కూడా డిసెంబరు 7, 8, 9 తేదీల్లో 'తెలంగాణ ఇన్వెస్‌మెంట్ థీమ్'తో సమ్మిట్ 2.0ను నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు వెల్లడించారు. దీనికోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వివేక్‌లతో ఉపసంఘంతోపాటు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. రక్షణ, ఏరోస్పేస్, ఫార్మా రంగంలో పెట్టుబడుల స్వీకరణకు వీలుగా దీనిపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్ట్‌పలు, పరిశ్రమలు సాధించిన విజయాలు, కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మద్దతు ధరతోపాటు బోనస్ ఇచ్చేందుకు ఏడు సన్నవడ్ల రకాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. "దీనికోసం ఇప్పటికే రైతాంగానికి విత్తనాలు కూడా సరఫరా చేశాం. ఏడు వడ్ల రకాలను వ్యవసాయ శాఖ వద్ద రిజిస్టర్ చేసుకున్న వారినుంచి ఆయా రకాలను సేకరించేందుకు మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇవ్వాలని నిర్ణయించాం.

## రాజకీయ యుద్ధాలకు
# కోర్టులా?

**ఆళ్లపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం**

**ఏ రైతూ కోర్టుకు ఎందుకు రాలేదు?.. పరిహారం కోసం వారు పిటిషన్ వేశారా?**

**ఓ పార్టీ వ్యక్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు.. సమీకరణ అంటే సివిల్ కేసు కదా**

**క్రిమినల్ కుట్రగా మార్చడం రాజ్యాంగ విరుద్ధం.. దురుద్దేశంతోనే 'అమరావతి'పై కేసు**

**నిజమైన బాధితులు వస్తే న్యాయం చేస్తాం.. అమరావతి భూసమీకరణ కేసు కొట్టివేత**

**చంద్రబాబు, నారాయణలకు ఊరట.. హైకోర్టు తీర్పును సమర్థించిన సీజేఐ బెంచ్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**
రాజధాని అమరావతి కోసం భూసమీకరణలో అక్రమాలు జరిగాయంటూ నమోదైన కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా పిటిషనర్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తీరుపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య బెంచ్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టులను రాజకీయ యుద్ధ క్షేత్రాలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది. రాజకీయ ప్రత్యర్థుల మధ్య జరిగే పోరాటాలకు న్యాయస్థానాలను వాడుకోవడం సరికాదని హితబోధ చేసింది. ఈ మేరకు ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. "అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన ప్రధాన కేసును హైకోర్టు ఇప్పటికే కొట్టివేసింది. ఆ తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ప్రధాన కేసు వీగిపోయిన తర్వాత, పబ్లిక్ డ్యూటీకి సంబంధించిన సెక్షన్ 166 వంటి తక్కువ స్థాయి నేరాల అభియోగాలతో మళ్లీ విచారణను కోరడం సహేతుకం కాదు. కేవలం రాజకీయ ప్రత్యర్థులు ఇచ్చిన ఫిర్యాదుతో దాఖలైన కేసుల్లో హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేసింది. రాజధాని నిర్మాణం కోసం 2016లో రైతుల నుంచి వ్యవసాయ భూములను సేకరించేందుకు ఏపీ ప్రభుత్వం భూసమీకరణ విధానాన్ని ప్రవేశపెట్టింది. భూమి ఇచ్చిన రైతులకు ఎకరానికి 1,000 చదరపు గజాల చొప్పున నివాస స్థలం, 250 చదరపు గజాల చొప్పున వాణిజ్య స్థలం అభివృద్ధి చేసి తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. రికార్డుల ప్రకారం 25 గ్రామాల్లోని 27,181 మంది భూయజమానులు 35,215 ఎకరాల భూమిని ఇచ్చారు.

## మైనారిటీల బుజ్జగింపే
# కాంగ్రెస్ లక్ష్యమా?

- **సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం**
- **ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న ప్రభుత్వం**
- **హైడ్రా చర్యలపై ప్రశ్నల వర్షం**
- **ఓటు బ్యాంకు రాజకీయాల ఆరోపణ**



**హైదరాబాద్, ఆగస్టు 14**
పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రత్యేక వర్గాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన ఆయన, ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం వ్యాఖ్యానించినట్లు పేర్కొంటూ రాంచందర్ రావు విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం చట్టాలు, నిబంధనలను అందరికీ ఒకే విధంగా అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉందని, కొందరికి ఒకలా మరికొందరికి మరోలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో హైడ్రా చర్యల పేరుతో పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్న సందర్భాల్లో ప్రభుత్వం ఎలాంటి సానుభూతి చూపడం లేదని ఆయన ఆరోపించారు. నిబంధనల ఉల్లంఘన పేరుతో చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, విద్యుత్ బిల్లులు చెల్లించని వారిపై మాత్రం సానుకూల వైఖరి అవలంబించడం ఎందుకని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఒకవైపు సామాన్య ప్రజలపై కఠిన చర్యలు తీసుకుంటూ, మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు చెల్లించకపోవడాన్ని సమర్థించేలా మాట్లాడటం కాంగ్రెస్ రాజకీయ స్వభావాన్ని ప్రతిబింబిస్తోందని రాంచందర్ రావు అన్నారు. ప్రజల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించే విధంగా ఇలాంటి వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని ఆయన విమర్శించారు. గతం నుంచి ఇప్పటి వరకు అదే రాజకీయ విధానాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సమాజంలో విభజనలను ప్రోత్సహించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో మతం, వర్గం అనే తేడాలు లేకుండా వ్యవహరించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, సమాన హక్కులు కల్పించే విధంగా పాలన సాగించాలని సూచించారు. ప్రజలందరినీ సమానంగా చూసే విధానమే రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## పట్టణాలు, గ్రామాల్లో
# తాగునీటికే పెద్దపీట!

**పారిశ్రామికావసరాలకు తర్వాతి ప్రాధాన్యం: సీఎం**

**రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి సద్వినియోగమే కీలకం**


**నెలవారీ లక్ష్యాలతో ప్రాధాన్య ప్రాజెక్టులు పూర్తి**

**పోలవరం వద్ద గండిపోశమ్మ గుడిని పరిరక్షించాలి**

**మార్చికల్లా విశాఖ వరకు ఎడమ కాలువ పూర్తి చేయాలి**

**డేటా సెంటర్లకు మూడున్నర టీఎంసీలు చాలు.. అయినా కొందరి దుష్ప్రచారం**

**జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**



**అమరావతి, ఆగస్టు 14**
రాష్ట్రంలో నీటి లభ్యత ఆధారంగానే (వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్) ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యమివ్వాలని స్పష్టంచేశారు. పారిశ్రామికావసరాలకు ద్వితీయ ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లోటు వర్షపాతం నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వలను, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలన్నారు. ఈ సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో జల వనరుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ సహా ప్రాధాన్య క్రమంలో చేపడుతున్న 36 ప్రాజెక్టుల పురోగతి, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగునీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక జలహారతి కార్యక్రమాల అమలుపై దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్–1 ఈసీఆర్ఎఫ్ గ్యాప్–2 పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇటీవల గోదావరికి 14 లక్షల క్యూసె క్కుల వరద వచ్చినా.. ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రాజెక్టు పనులు కొనసాగించామని తెలిపారు. డ్యాం సైట్ వద్ద రహదారులతో పాటు డ్యాం నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్‌ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చికల్లా విశాఖ వరకూ ఎడమ ప్రధాన కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలన్నారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు నింపాలని సూచించారు. పోలవరం కుడి, ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. ఈ రెండు కాలువలకూ మంచి పేర్లు సూచించాలని అధికారులను కోరారు. ప్రాజెక్టు సమీప ప్రాంతాలను పర్యాటకంగానూ తీర్చిదిద్దాలన్నారు. గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు, కృష్ణా డెల్టాకు అవసరమైనంత మేర తీసుకెళ్లేందుకు ఆస్కారం ఉందని.. విశాఖ నుంచి అమరావతి వరకూ అంతర్గత జల రవాణా మార్గాలతో అనుసంధానించాలని సూచించారు. డేటా సెంటర్లకు మొత్తంగా మూడున్నర టీఎంసీలు సరిపోతాయని, అయినా ఈ విషయంలో కొందరు లేనిపోని విమర్శలు, దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జల వనరుల శాఖ అధీనంలో ఉన్న భూములను సర్వినియోగం చేసుకునే అవకాశాలను అధ్యయనం చేయడంతో పాటు నిర్వాసితుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 36 ప్రాధాన్య ప్రాజెక్టులనూ.. నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఆయకట్టుకు నీరిచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని ఆదేశించారు.

## పార్టీ గీత దాటితే చర్యలు తప్పవు
### రాజగోపాల్ వ్యాఖ్యలపై పీసీసీ ఘాటు హెచ్చరిక



**హైదరాబాద్, ఆగస్టు 14**
కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని, ఈ విషయాన్ని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిని సహించబోమని స్పష్టం చేశారు. పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మహేష్ గౌడ్ హెచ్చరించారు. పార్టీ గీత దాటితే ముఖ్యమంత్రితో సహా ఎవరైనా ఒకటేనని పేర్కొన్నారు. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో ఎలాంటి వెనుకంజ ఉండదన్నారు.

## భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దు..
### ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్ వార్నింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోభాల్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌పై డిస్కవరీలో త్వరలో ప్రసారం కానున్న డాక్యుమెంటరీ సిరీస్‌లో భాగంగా ఎన్ఎస్ఏ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎన్ఎస్ఏ ఇంటర్వ్యూ ఇవ్వడం ఇదే తొలిసారి. పహల్గాం దాడి తరువాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పరిస్థితులపై అజిత్ దోభాల్ ఈ డాక్యుసిరీస్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు ఏమిటో ముందస్తుగానే నిర్ణయించుకున్నామని అజిత్ దోభాల్ తెలిపారు. పహల్గాం దాడి వెనకున్న ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేయడమే తమ టార్గెట్ అని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలపై భారత్ దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్‌తో పంపామని చెప్పారు. 'ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాము. భారత దేశ సహనాన్ని బలహీనతగా భావించి పొరపాటు చేయొద్దు. భారత్ ఎంతటి రిస్కైనా తీసుకోగలదు. పర్యావసానాలను లెక్క చేయకుండా దాడులు చేయగలదు' అని ఆయన అన్నారు.

## రాహుల్‌కు సభా హక్కుల
# ఉల్లంఘన నోటీసు

**అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఫిర్యాదు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**
ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సభా హక్కులను ఉల్లంఘించారని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీలు లోక్‌సభ సెక్రటేరియట్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సమాధానం చెప్పాలని సూచిస్తూ ఆ కార్యాలయం రాహుల్ కు నోటీసు పంపించింది. పబ్లిక్ పరీక్షల్లో అను చిత చర్యల నివారణ సవరణ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. రూల్ నెంబరు 353 ప్రకారం ముందస్తుగా నోటీసు ఇవ్వకుండానే అమిత్ షాపై తీవ్రమైన ఆరోపణలు చేశారని, అన్‌పార్లమెంటరీ భాషను ఉపయోగించారని పేర్కొన్నారు.

# ట్రంప్ సుంకాల ప్రభావంపై ఆలోచించాలి

**దేశీయంగా సన్నద్ధతను సంతరించాలి**

**మేధావులు,రాజకీయ, ఆర్థికవేత్తలతో చర్చించాలి**

**న్యూఢిల్లీ :** ట్రంప్ అమెరికా అధ్యక్షుడుయ్యాక మన పరిస్థితి ఎలా ఉందో బేరీజు వేసుకునే సమయం వచ్చింది. నిరుద్యోగ భారతాన్ని ఇంకెంతో కాలం నెట్టుకు రావడం సాధ్యం కాదని మోడీ గుర్తించాలి. ఈ క్రమంలో అమెరికా ప్రభావంపై దేశీయంగా చర్చించాలి. మేధావులు, ఆర్థికవేత్తలు, విదేశీ నిపుణలతో పాటు రాజకీయనేతలో వరుసగా చర్చలు చేయాలి. ఇందులో సిగ్గుపడాల్సిన పనిలేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం కూడా సరికాదు. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా.. గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు.సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్న తీరు సరికాదు. చంద్రబాబు లాంటి వారు ఇప్పటికైనా స్పందించాలి. మోడీ విధానాలకు తందానా అనకుండా అంతర్గగత చర్చలకు పట్టుబట్టాలి. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోవడం మానుకోవాలి. ఆర్థిక ఉపద్రవం ముంచుకు వస్తున్న వేళ జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. దేశంలో నిరుద్యోగం 46 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడం తప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. జిఎస్టీ లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ది గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. నల్లధనాన్ని తవ్వితీయ దమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. దీనిని గుర్తించి పన్నులను హేతుబద్దీ కరించాలి. పోపుల డబ్బాలో కూడబెట్టుకున్న దానికి సైతం జిఎస్టీ కట్టే దరిద్రం దాపురించింది. అధికారం లోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతుల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాల సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ అమలు కాలేదు. ఈ క్రమంలో అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విస్తృత చర్చ జరగాల్సి ఉంది.

## తిరుమలలో విఐపిలకే ప్రాధాన్యం

**సామాన్యులకు దక్కని దర్శనభాగ్యం**

**తిరుమల :** తిరుమలలో వేసవి రద్దీ కొనసాగుతోంది. కంపార్ట్‌మెంట్లో నిండి బయటకు క్యూలు కడుతున్నారు. ఏటా ఇదే తంతు సాగుతోంది. విఐపిలు పదేపదే రావడంతో వారికోసం దర్శనాలను నిలిపివేస్తున్నారు. వారి రాకను నియంత్రిస్తామన్న హామీ నెరవేరడం లేదు.తిరుమల శ్రీవారిని సామాన్యులు మాత్రమే దర్శించుకునేలా ఆంక్షలు విధించాలని భక్తులుకోరుతున్నారు. రద్దీ ఉన్న సమయాల్లోనూ విఐపిలు రావడం వల్ల తీవ్రిబ్బందులు కలుగుతున్నాయని, సామాన్యులకు దర్శనం కలగడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. భక్తులు తమ ఆపదల మొక్కులు తీర్చుకోవడానికి వస్తారని అలాంటి సమయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. అయినా దేవుడికి భక్తుడికి మధ్య అధికారుల పెత్తనం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుమలలో ముందు భక్తులకు సత్వర దర్శనం కలిగేలా విఐపిలను నియంత్రించాలని అన్నారు. ఆ నిబంధనేదో ముందు ప్రజాప్రతినిధులకు విధించాలని అంటున్నారు. తిరుమల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం. కావడంతో దేశ విదేశాల నుంచి భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారు.


# ‘మన సమాజం’ కథనానికి స్పందన..

**ఫాగింగ్‌కు దిగిన మున్సిపల్ అధికారులు!**

**‘కరెంటు కోత.. దోమల మోత’ కథనంతో అధికారుల్లో కదలిక**

**వార్డుల్లో ఫాగింగ్ చేపట్టడంతో లక్షెట్టిపేట ప్రజల్లో హర్షం**

**లక్షెట్టిపేట, ఆగస్టు 14 (మన సమాజం):**
‘మన సమాజం’ పత్రికలో ఆగస్టు 5న “కరెంటు కోత.. దోమల మోత” శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించారు. వర్షాకాలంలో దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడే పరిస్థితులు నెలకొన్న విషయాన్ని కథనం ద్వారా వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు వెంటనే స్పందించారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని లక్షెట్టిపేట పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ సిబ్బందితో ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ‘మన సమాజం’ పత్రికకు లక్షెట్టిపేట ప్రజలు అభినందనలు తెలిపారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాదు.. వాటి పరిష్కారానికి అధికారుల్లో కదలిక తీసుకురావడమే ‘మన సమాజం’ కథనాల ప్రభావం అని స్థానికులు పేర్కొన్నారు.



మన సమాజం
Truth towards the Society
Editor Parvathi Rajesh Kumar 9989788438

**కరెంటు కోత.. దోమల మోత..**

**లక్షెట్టిపేట ఆగస్టు04(మన సమాజం)**
లక్షెట్టిపేట లో రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయం సందర్భం లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళ గంటల తరబడి కరెంటు కట్ చేయడంతో నరకయాతన అనుభవిస్తున్నామని చెబుతు న్నారు. విద్యుత్ కోతల కారణంగా జనాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. రాత్రిళ్లు కూడా కరెంట్ కోతలతో.. పసిపిల్లల తల్లులు విసనకర్రలతో గాలి విసురుతూ కూర్చోవాల్సి వస్తోంది. ఇది ఇలా ఉండగా అటు దోమలతో పరేషాన్ నెలకోసారైనా జాడలేని ఫాగింగ్ అనారోగ్యం పాలవుతున్న ప్రజలు దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి నెలలో రెండు, మూడు సార్లు ఫాగింగ్ చేస్తే ఎంతో కొంత దోమలను నివారించే ఆస్కారం ఉంటుంది. కానీ అది ఎక్కడా అమలు కావడం లేదు. అధికారులు సంవత్సరంలో కనీసం రెండు, మూడు సార్లు కూడా ఫాగింగ్ చేయించడం లేదు. దీంతో రోజురోజుకూ దోమల బెడద ఎక్కువవుతోంది. బయటకు వస్తే దోమలతో తట్టుకోలేకపో తున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల వల్ల గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకుతాయని భయపడుతున్నారు. ఇప్పటికైన పట్టణంలో అధికా రులు ఫాగింగ్ నిర్వహించి దోమలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



# గవర్నర్ వ్యవస్థ రద్దు కోసం పోరాడాలి !

**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు ఇటీవల అనేక చారిత్రక తీర్పులను వెలువరిస్తోంది. అనేక విషయాల్లో మార్గనిరద్దేశనం చేస్తోంది. ఇవన్నీ కూడా పాలకులకు కనువిప్పు కావాలి. రాజకీయ నాయకులపై కేసులు కావచ్చు..వారి ఆస్తులు కావచ్చు..గవర్నర్ వ్యవస్థ కావచ్చు..ఇలా అనేక త చారిత్రక తీర్పులు వస్తున్నాయి. ఇకపోతే గవర్నర్ వ్యవస్థ ఆరోవేలు లాంటిది. దానితో ఆడుకోవడం రాజకీయ నాయకులకు అవసరం. అందుకే గవర్నర్ వ్యవస్థను ఎత్తేయలేకపోతున్నారు. దేశంలో ఈ వ్యవస్థ వల్ల ఏటా వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. రాజకీయ పాచికలు ఆడేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఉపయోగించు కుంటోంది తప్ప ప్రజలకు నేరుగా ఉపయోగం లేదు. అంతేకుండా రాష్ట్రాల్లో అనవసర అధికార కేంద్రంగా మారింది. దీనిని ఎత్తేయాలని ఎన్టీఆర్ సహా అందరూ డిమాండ్ చేసినవారే. కానీ వినేదెవ్వరు... వినిపించే దెవ్వరు అన్న చందంగా ఇప్పుడు పరిస్థితి తయారయ్యింది. గవర్నర్ పోస్టు లేకుండా ప్రభుత్వం నడుస్తుంది. కానీ దీనివల్ల ఉపయోగం లేదని తెలిసినా కొనసాగిస్తున్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఉపయోగిస్తున్నారు. అధికారంలో కాంగ్రెస్, ఉన్నా, ఇప్పుడు బిజెపి ఉన్నా ఒరిగిందేమీ లేదు. అందుకే దివంగత ఎన్టీఆర్ దీని రద్దు కోసం ఆనాడు గట్టిగానే డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు కూడా ఇవే డిమాండ్ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్, బిజెపిలు మాత్రం రోరు మెదపడం లేదు. ఇటీవల తమిళనాడు వ్యవహారం తీసుకుంటే ఎంత రచ్చయ్యిందో చూశాం. గతంలో బెంగాల్లోనూ, కేరలలోనూ ఇదే తరహా రాజకీయాలు నడిపారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న తమిళసై సైతం ఇదే తరహాలో వ్యవహరించింది.కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ తాబేదార్లు గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తోంది. కేరళ ప్రభుత్వం లేవనెత్తిన అంశాల ప్రాధాన్యతను, ఔచిత్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్పింది. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పలు బిల్లులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి. ఇటీవల సుప్రీంతో చివాట్లు తిన్నారు. అంతేగాకుండా ఆయన ప్రమేయం లేకుండానే బిల్లులను పాస్ చేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. అనేక చారిత్రాత్మక తీర్పులను వెలువరిస్తున్న సుప్రీంకోర్టు...మరో చారిత్రాత్మక తీర్పుతో తమిళనాడు గవర్నర్ చెంపచెల్లుమనిపించింది. గవర్నర్ల మితిమీరిన నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు...బిజెపి కాంగ్రెస్‌లకు కనువిప్పుకావాలి. కాంగ్రెస్ కాలం నుంచే గవర్నర్ వ్యవస్థను రాజకీయపునరావాస కేంద్రాలుగా మార్చుకుంది. బిజెపి కూడా దానిని కొనసాగించింది. తమిళనాడు గవర్నర్ రవి అనుసరించిన తీరుపై సుప్రీం తీర్పు రాజ్యాంగ వ్యవస్థను బలోపేతం చేసేదిగా ఈ తీర్పు... సహజంగానే డిఎంకె ప్రభుత్వానికి భారీ విజయంగా చూడాలి.. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఫెడరలిజం బలోపేతానికి జరుగుతున్న పోరాటానికొక ఊతం. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకో రక్షణ కవచం. ఈ తీర్పు ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితమైనది కాదు. మొత్తం భారతదేశంలోని రాష్ట్రాలన్నింటికీ సంబంధించినది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పు సూటిగా ఉంది. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. అంతేకాదు గవర్నర్లు ఎంతో ఉండాలో నిర్దేశించింది. నెలలోగా బిల్లులను ఆమోదించాలని చెప్పింది. లేకుంటే అవి బిల్లులగా మారుతాయని తేల్చింది. ఈ తీర్పు ఎలాంటి అనుమానాలు లేకుండా చాలా స్పష్టంగా వుంది. గవర్నర్లంటే... కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేసే దుస్సంప్రదాయానికి ఈ తీర్పు చెల్లుచీటీ రాసింది. బిజెపి ఎక్కడా ఈ తీర్పుపై మాట్లాడ లేదు. రాజ్యాంగానికి దెబ్బపడకుండా చూస్తామని చెప్పలేదు. గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలగవలసిన వ్యక్తి కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గతంలో 'ఎస్.ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. తాజాగా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా తనవద్దే తొక్కిపెట్టిన గవర్నర్ వైఖరిని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. 'కీలకమైన 10 బిల్లులను ఆమోదించకుండా తన వద్దనే తొక్కిపెట్టి , ఆయన తీసుకున్న నిర్ణయం, వ్యవహరించిన తీరు చట్టవిరుద్ధం, ఏకపక్షం' అని అభివర్ణించింది. తమిళనాడు గవర్నర్ రవి తన నియామకం జరిగిన నాటినుంచీ ఇలాగే వ్యయహరించారు. ఒకసారి శాసనసభ బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం కాలపరిమితిని కూడా నిర్దేశిరచింది. ఈ బిల్లులకు సంబంధించి గవర్నర్ తీసుకున్న చర్యలన్నీ రద్దవుతా యని, అసెంబ్లీ... గవర్నర్‌కు తిరిగి పంపిన తేదీ నుంచి ఈ బిల్లులన్నీ ఆమోదం పొందినట్లు- పరిగణించాలని సుప్రీం స్పష్టం చేసింది. అంతేకాదు, గవర్నర్ రవి చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కోర్టు తప్పుబట్టింది. ప్రజలచే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల సలహా మేరకు గవర్నర్ వ్యవహరించాలని, రాష్ట్రాలను వీటో చేసే అధికారం రాజ్యాంగం వీరికి ఇవ్వలేదని కోర్టు పునరుద్ఘాటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావసరాలు, సంక్షేమం కోసం చట్టాలను రూపొందిస్తాయి. వాటిని నిరోధించే వైఖరి రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుపడటం గవర్నర్ పని కాదని ఎత్తిచూపుతూ...గవర్నర్ రవి అడ్డుకున్న పది బిల్లులను సుప్రీం ఆమోదించింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని సమర్థించే ఈ తీర్పు...అసెంబ్లీ హక్కులను హరించే గవర్నర్ల వైఖరికి ఒక హెచ్చరిక. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు చెంపపెట్టు లాంటిదని కడా చెప్పకతప్పదు. అంబేద్కర్ యంతికి ముందు వచ్చిన ఈ తీర్పు రాజ్యాంగాన్ని కాలరాస్తున్న వారికి కనువిప్పుకావాలి. ఈ సందర్భంగా ఉటంకించిన సుప్రీంకోర్టు పాలకులకు గట్టిగానే చురకలు వేసింది. ఈ క్రమంలో వచ్చిన ఈ తీర్పుతో...అస్పష్టతకు తెరపడింది. బిల్లులపై సంతకం చేయడానికి రాజ్యాంగం నిర్దిష్ట సమయాన్ని పేర్కొనలేదని చేసే వాదనలకు సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. ఈ తీర్పుతో అయినా గవర్నర్ వ్యవస్థ పనిలేదని గుర్తించాలి. దీనిని రద్దు చేసేందుకు అంతా ఉద్యమించాలి.

# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి !

**న్యూఢిల్లీ :** అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహతంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శతృవులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ర్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్త్‌లను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి.

# త్యాగాల వెలుగుల్లో వికసించిన భారతం

**స్వేచ్ఛ కోసం సాగిన మహా పోరాటం**


**అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న దేశం**

**యువత చేతుల్లో భారత భవిష్యత్తు**

**హైద్రాబాద్, ఆగస్టు 14**

భారతదేశ చరిత్రలో ఆగస్టు 15కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలనకు ముగింపు పలుకుతూ 1947 ఆగస్టు 15న భారత్ స్వాతంత్ర్యాన్ని సాధించింది. ఈ స్వేచ్ఛ వెనుక లక్షలాది మంది దేశభక్తుల త్యాగాలు, వేలాది మంది అమరవీరుల బలిదానాలు, ఎన్నో కుటుంబాల కన్నీళ్లు ఉన్నాయి. విదేశీ పాలన సంకెళ్లను తెంచుకుని స్వేచ్ఛా భారతంగా అవతరించిన రోజు కావడంతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జాతీయ పండుగగా ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి గ్రామం, ప్రతి పట్టణం,





ప్రతి విద్యాసంస్థలో జాతీయ పతాకం రెపరెపలాడుతుండగా దేశభక్తి గీతాలు మారుమోగుతాయి. భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచ చరిత్రలోనే ఒక విశిష్ట అధ్యాయంగా నిలిచింది. అహింసా మార్గంలో మహాత్మా గాంధీ నాయకత్వం వహించిన ఉద్యమాలు ప్రజల్లో చైతన్యం నింపగా, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్ వంటి వీరులు తమ ధైర్యసాహసాలతో యువతను ఉత్తేజపరిచారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు సహా సమాజంలోని అన్ని వర్గాలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం వల్ల అది ప్రజల ఉద్యమంగా మారింది. జైలు శిక్షలు, కాల్పులు, చిత్రహింసలు ఎదురైనా వెనుకడుగు వేయని పోరాట యోధుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వేచ్ఛ లభించింది.స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణం ఒక పెద్ద సవాలుగా మారింది. విభజన కారణంగా ఏర్పడిన సమస్యలు, పేదరికం, నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటుతనం వంటి అనేక ఇబ్బందులను అధిగమిస్తూ భారత్ ముందుకు సాగింది. రాజ్యాంగం అమలులోకి రావడంతో ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమైంది. ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించే వ్యవస్థ ఏర్పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి సాధించడం నుంచి అంతరిక్ష పరిశోధనల్లో ప్రపంచాన్ని ఆశ్చర్యపరచడం వరకు భారత్ అనేక విజయాలను నమోదు చేసింది. ఒకప్పుడు ఆహార ధాన్యాల కోసం ఇతర దేశాలపై ఆధారపడిన దేశం నేడు ప్రపంచానికి ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. చంద్రయాన్, ఆదిత్య వంటి అంతరిక్ష మిషన్లు భారత శాస్త్రవేత్తల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాయి. సమాచార సాంకేతిక రంగంలో భారత యువత ప్రపంచవ్యాప్తంగా తమ మేధస్సును నిరూపిస్తూ దేశ కీర్తిని మరింత పెంచుతున్నారు.ఆర్థిక రంగంలోనూ భారత్ వేగంగా ఎదుగుతోంది. ప్రపంచంలో ప్రముఖ ఆర్థిక శక్తిగా అవతరించే దిశగా అడుగులు వేస్తోంది. పారిశ్రామిక అభివృద్ధి, డిజిటల్ విప్లవం, మౌలిక సదుపాయాల విస్తరణ దేశ ప్రగతికి కొత్త ఊపునిస్తున్నాయి. అంతర్జాతీయ వేదికలపై భారత స్వరం మరింత బలంగా వినిపిస్తోంది. ప్రపంచ సమస్యల పరిష్కారంలోనూ భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే అభివృద్ధి ప్రయాణంలో ఇంకా అనేక సవాళ్లు మిగిలే ఉన్నాయి. పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతలు, పర్యావరణ సమస్యలు వంటి అంశాలు దేశం ముందున్న ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరేలా కృషి చేయాల్సిన అవసరం ఉంది. సమగ్రాభివృద్ధి ద్వారానే స్వాతంత్ర్య స్ఫూర్తికి నిజమైన అర్థం లభిస్తుంది.భారత బలం దాని వైవిధ్యంలో ఉంది. భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన ప్రజలు ఒకే జాతీయ పతాకం కింద ఐక్యంగా నిలవడం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. మత, కుల, ప్రాంత భేదాలకు అతీతంగా దేశ ప్రయోజనాలను ముందుంచినప్పుడే స్వాతంత్ర్య స్ఫూర్తి మరింత బలోపేతం అవుతుంది. ఐక్యత, సమైక్యత భారత ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలుగా నిలిచాయి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుంచుకుంటూ దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాల్సిన బాధ్యత యువతపై ఉంది. విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణలు, సామాజిక బాధ్యతతో ముందుకు సాగినప్పుడే యువశక్తి దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లగలదు. దేశభక్తి అనేది కేవలం నినాదాల్లో కాకుండా కర్తవ్య నిర్వహణలో కనిపించాలి. స్వాతంత్ర్య దినోత్సవం మనకు స్వేచ్ఛ విలువను గుర్తుచేసే మహత్తర సందర్భం. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకోవడం, వారి ఆశయాలను కొనసాగించడం, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి కృషి చేయడం ప్రతి భారతీయుడి బాధ్యత. త్యాగాల వెలుగుల్లో వికసించిన ఈ భారతం మరింత శక్తివంతంగా, సమృద్ధిగా ఎదగాలని ఆకాంక్షిస్తూ దేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోంది.

## బంగ్లాదేశ్‌లో పాగా వేసేందుకు అల్‌ఖైదా ప్రయత్నాలు..ఐరాస హెచ్చరిక

- ఉగ్రవాద సెల్స్ ఏర్పాటు దిశగా ఏక్యూఐఎస్ కదలికలు
- దక్షిణాసియాలో పెరుగుతున్న ఉగ్ర ముప్పుపై ఆందోళన
- ఆర్థిక, లాజిస్టిక్ నెట్‌వర్క్‌ల విస్తరణపై నిఘా



**న్యూయార్క్, ఆగస్టు 14**

బంగ్లాదేశ్‌ను కేంద్రంగా చేసుకుని ఉగ్రవాద కార్యకలాపాలను విస్తరించేందుకు అల్‌ఖైదా అనుబంధ సంస్థ 'అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్' (ఏక్యూఐఎస్) ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. దక్షిణాసియాలో ఉగ్రవాద ముప్పు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ ఐరాస భద్రతా మండలికి సమర్పించిన 38వ నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది. ఐసిస్, అల్‌ఖైదా తదితర ఉగ్ర సంస్థల కార్యకలాపాలను పర్యవేక్షించే విశ్లేషణ, ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. నివేదిక ప్రకారం ఏక్యూఐఎస్ గతంలో మాదిరిగా పెద్ద ఉగ్రవాద బృందాలపై ఆధారపడకుండా చిన్నచిన్న రహస్య సెల్స్ ద్వారా కార్యకలాపాలను విస్తరిస్తోంది. బంగ్లాదేశ్‌లో స్థానిక స్థాయిలో మద్దతుదారులను సమీకరించడంతో పాటు ఆర్థిక, లాజిస్టిక్ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఐరాస గుర్తించింది. ఈ వ్యూహం ద్వారా భద్రతా సంస్థల కళ్లుగప్పి ప్రాంతీయ స్థాయిలో ప్రభావాన్ని పెంచుకోవాలని ఉగ్రవాద సంస్థలు భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. బంగ్లాదేశ్‌ను ఉగ్ర నెట్‌వర్క్ నిర్మాణానికి కీలక స్థావరంగా మార్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఐరాస తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడి రాజకీయ పరిణామాలు, భద్రతా పరిస్థితుల్లో వచ్చిన మార్పులను కొందరు తీవ్రవాద సంస్థలు తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నాయని హెచ్చరించింది. ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడంతో పాటు కొత్త సభ్యులను చేర్చుకునేందుకు కూడా ఈ సంస్థలు కసరత్తు చేస్తున్నట్లు నివేదికలో పేర్కొంది. 2025 నవంబరులో ఢిల్లీలో జరిగిన ఎర్రకోట దాడికి ఏక్యూఐఎస్‌తో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలిన అంశాన్ని కూడా నివేదిక ప్రస్తావించింది. ఈ ఘటన దక్షిణాసియాలో ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలు ఇంకా చురుగ్గా కొనసాగుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తోందని విశ్లేషించింది. ప్రాంతీయ భద్రతకు ముప్పుగా మారే ఈ తరహా నెట్‌వర్క్‌లను ముందుగానే అణచివేయాల్సిన అవసరం ఉందని సూచించింది. దక్షిణాసియాలో ఉగ్ర ముప్పు పెరగడానికి పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో కొనసాగుతున్న అస్థిరత కూడా ఒక ప్రధాన కారణమని ఐరాస నివేదిక పేర్కొంది. తాలిబన్ పాలనలో ఆఫ్ఘనిస్థాన్‌లో పలు ఉగ్రవాద సంస్థలు ఆశ్రయం పొందుతున్నాయని, అవి పొరుగు దేశాల భద్రతకు దీర్ఘకాలిక ప్రమాదంగా మారే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. ఈ పరిస్థితి మొత్తం ప్రాంతంలో భద్రతా సవాళ్లను మరింత పెంచుతోందని వెల్లడించింది. ఉగ్రవాద సంస్థల వ్యూహాలు మారుతున్న నేపథ్యంలో సభ్య దేశాలు అప్రమత్తంగా ఉండాలని ఐరాస సూచించింది. సమాచార మార్పిడి, సరిహద్దు భద్రత, ఉగ్రవాద నిధుల నియంత్రణ, అంతర్జాతీయ సహకారం వంటి అంశాల్లో మరింత సమన్వయం అవసరమని పేర్కొంది. దక్షిణాసియాలో శాంతి, భద్రతలను కాపాడేందుకు అన్ని దేశాలు సమిష్టిగాచర్యలు తీసుకోవాలనిఐరాస పిలుపునిచ్చింది.

# రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

- రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు
- తెలంగాణ రైజింగ్ 2.0కు ఆమోదం
- సన్న ధాన్యానికి బోనస్.. ఈవీ ఆటోలకు సబ్సిడీ
- యంగ్ ఇండియా స్కూళ్లు, సాగునీటి ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్




**హైదరాబాద్, ఆగస్టు 14:**

రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలను ఆమోదించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు కుటుంబ సభ్యుల పేర్ల నమోదుతో అదనంగా 62 లక్షల మందికి లబ్ధి చేకూరిందని, ప్రస్తుతం రాష్ట్రంలో 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారని వెల్లడించింది. వీరందరికీ స్మార్ట్ కార్డులు అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. గత ఏడాది విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ సదస్సు తరహాలో ఈ ఏడాది 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సదస్సును 'ఇన్వెస్ట్ తెలంగాణ' అంశంతో నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ ప్రణాళిక ఆవిష్కరణతో పాటు రక్షణ, అంతరిక్ష, ఔషధ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక ప్రదర్శనలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.వ్యవసాయ రంగానికి సంబంధించి వానాకాలంలో ఏడు రకాల సన్న ధాన్యాల సాగును ప్రోత్సహించాలని కేబినెట్ నిర్ణయించింది. గ్రామపంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించింది. ఈ ఏడాది నుంచి గుర్తించిన ఏడు రకాల సన్న ధాన్యాలకు మాత్రమే క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటించింది. అలాగే యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన మిగులు ధాన్యాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు ఆమోదం తెలిపింది. నైపుణ్యాభివృద్ధి రంగంలో కీలక మార్పులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. అదేవిధంగా ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు 86 పాఠశాలలకు అనుమతులు మంజూరైనట్లు వెల్లడించింది.హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు పెట్రోల్, డీజిల్ ఆటోలను విద్యుత్ ఆటోలుగా మార్చే ప్రత్యేక పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల వ్యయంతో అమలయ్యే ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ అందించనున్నారు. పాత ఆటోలకు విద్యుత్ కిట్ అమర్చుకోవడం లేదా కొత్త విద్యుత్ ఆటోలు కొనుగోలు చేసేందుకు ఈ సాయం ఉపయోగపడనుంది. అలాగే నగరంలోని కాలుష్యకారక పరిశ్రమల తరలింపుకు సంబంధించిన హెచ్ఐఎల్టీ విధానం దరఖాస్తుల గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించింది. సాగునీరు, విద్యుత్ రంగాలకు సంబంధించి కూడా కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులకు రూ.2,100 కోట్ల అంచనా వ్యయాన్ని ఆమోదించింది. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీటి అవసరాలు తీరనున్నాయి. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికీ కేబినెట్ అనుమతి మంజూరు చేసింది.

## యాదగిరిగుట్టలో అభివృద్ధి పనులకు.. రూ.55.95 కోట్లు

**సొంత నిధులు ఇస్తానన్న బోర్డు చైర్మన్ సత్యనారాయణరెడ్డి**


**ఆలయ అభివృద్ధికి ట్రస్టు బోర్డు పలు కీలక నిర్ణయాలు**

**యాదాద్రి, ఆగస్టు 14**

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న విజన్-2047కు అనుగుణంగా యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధికి ఆలయ ధర్మకర్తల మండలి(ట్రస్టు బోర్డు) కీలక నిర్ణయాలు తీసుకుంది. చైర్మన్ మన్నె సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన ట్రస్టు బోర్డు సమావేశమైంది. ఇందులో పలు తీర్మానాలను ఆమోదించారు.ఆ వివరాలను సత్యనారాయణరెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల దీక్షలు చేపట్టే భక్తుల కోసం కొండపై విష్ణుపుష్కరిణి వద్ద దీక్షాపరుల మండపం, స్వామివారి నిత్యకల్యాణ మండపం, హైదరాబాద్-వరంగల్ హైవేపై రాయిగిరి వద్ద స్వాగత తోరణ నిర్మాణాలను రూ.55.95కోట్లతో చేపట్టడానికి ట్రస్ట్ బోర్టు ఆమోదించింది. ఈ మూడు నిర్మాణాలకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ సత్యనారాయణరెడ్డి తన సొంత నిధులను అందిస్తున్నట్లుగా ప్రకటించారు. కొండపై శంఖు, చక్ర, నామాల విద్యుత్ బల్బుల బోర్డును పునరుద్ధరించాలని నిర్ణయించారు. దీనికోసం రూ.85లక్షలను సమకూర్చడానికి ధర్మకర్త కొణిదెల సురేఖ ముందుకు వచ్చారు. మరోవైపు, పెద్దగుట్ట టెంపుల్ సిటీపై వేదపాఠశాల, విశ్వవిద్యాలయంతో పాటు 40ఎకరాల్లో మోడల్ గోశాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. స్వామివారి భక్తులకు ప్రస్తుతం అందిస్తున్న అన్నప్రసాదాన్ని 2వేల మందికి పెంచారు. తిరుమల తరహాలో టీసీఎస్ సహకారలంతో ఆన్‌లైన్ సేవలు, టికెట్ వ్యవస్థను రూపొందించాలని నిర్ణయించారు. ఇక ఆలయ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం కోసం ఐఎస్‌బీఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్) సంస్థను కన్సల్టెంట్‌గా నియమించడానికి ట్రస్టు బోర్డు ఆమోదం తెలియజేసింది. దేవస్థాన విద్యుత్ వినియోగ వ్యయభారం తగ్గింపు కోసం 4 మెగావాట్ల సోలార్ గ్రిడ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వృద్ధులు, పిల్లల సౌలభ్యం కోసం కొండకింద వసతి గదుల వద్ద రూ.9 లక్షలతో అదనంగా కల్యాణ కట్ట నిర్మాణం చేపట్టనున్నారు. అదేవిధంగా దాతలను ఆలయ అభివృద్ధిలో భాగస్వాములను చేయడానికి కొండపై వేంచేపు మండపం పక్కన దాతల కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

# సినిమాలకు దూరంగా ఉన్న సురేఖ వాణి..

## మళ్లీ ఫిట్‌నెస్‌పై ఫోకస్, త్వరలోనే రీఎంట్రీ?



టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సురేఖ వాణి. ఒకప్పుడు హీరోయిన్లకు అక్క, వదిన, స్నేహితురాలు వంటి పాత్రల్లో కనిపించిన ఆమె.. ఆ తర్వాత తల్లి, ఆంటీ పాత్రల్లోనూ మెప్పించారు. తన సహజమైన నటన, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే కొంతకాలంగా సురేఖ వాణి సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు.ఇటీవల విడుదలైన 'కెజెక్యూ' సినిమాలో హీరోయిన్ యుక్తికి అండగా నిలిచే ఆంటీ పాత్రలో ఆమె కనిపించారు. అయితే ఈ సినిమా మినహా ఇటీవలి కాలంలో సురేఖ వాణికి చెప్పుకోదగ్గ స్థాయిలో అవకాశాలు కనిపించలేదు. మరోవైపు తన కుమార్తె సుప్రీతను హీరోయిన్‌గా పరిచయం చేసి ఆమె సినీ కెరీర్‌ను నిలబెట్టేందుకు కూడా సురేఖ వాణి కొంతకాలం ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సుప్రీతకు అవకాశాలు తీసుకురావడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ అవి ఆశించిన స్థాయిలో వర్కౌట్ కాలేదు. దీంతో ఇప్పుడు సురేఖ వాణి తన కుమార్తె కెరీర్‌తో పాటు తన సినీ ప్రయాణంపైనా మరోసారి ఫోకస్ పెట్టినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇందులో భాగంగానే ఆమె తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. సురేఖ వాణి తాజాగా జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ వీడియోలో ఆమె ఎంతో ఎనర్జిటిక్‌గా కసరత్తులు చేస్తూ కనిపించారు. ఫిట్‌నెస్ విషయంలో ఆమె చూపిస్తున్న శ్రద్ధ, వర్కౌట్ చేసే విధానం నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. వీడియో చూసిన అభిమానులు కూడా ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. 'సురేఖ వాణి మళ్లీ సినిమాల్లోకి వస్తున్నారా?', 'ఫిట్‌నెస్ చూస్తుంటే ఇంకా హీరోయిన్‌లానే ఉన్నారు' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన జిమ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు సురేఖ వాణి వయసు విషయంలో కూడా సోషల్ మీడియాలో కొంతకాలంగా భిన్నమైన ప్రచారాలు జరుగుతున్నాయి. ఆమె వయసుపై వివిధ ఆన్‌లైన్ వేదికల్లో వేర్వేరు వివరాలు కనిపిస్తుండటంతో నెటిజన్లలోనూ ఆసక్తి నెలకొంది. అయితే ఆమె వయసుకు సంబంధించిన అధికారిక వివరాల విషయంలో స్పష్టత లేదు.సురేఖ వాణికి కుమార్తె సుప్రీత ఉన్న విషయం తెలిసిందే. తల్లి, కూతురు ఇద్దరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తమ ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సురేఖ వాణి ఇప్పుడు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడంతో ఆమె రీఎంట్రీపై ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఆమె చేతిలో ఏవైనా కొత్త ప్రాజెక్టులు ఉన్నాయా అనే విషయంపై అధికారిక సమాచారం లేదు. అయితే తాజా జిమ్ వీడియో మాత్రం ఆమె మళ్లీ సినిమాల్లో యాక్టివ్ అవుతారనే చర్చకు తెరలేపింది.



## ఆజా మేరీ జాని..!



టిను అనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, విష్ణుకార్తికేయ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న న్యూఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్‌షీప్'. గుణి మంచికంటి దర్శకుడు. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని అక్టోబర్ 9న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఈ సినిమా నుంచి 'ఆజా మేరీ జాని' అంటూ సాగే తొలి పాటను అగ్ర సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ విడుదల చేశారు.వీశీజఅవం పార్టీ సాంగ్‌ను అజయ్ లగుసాని, ఓయ్ విష్ణులపై చిత్రీకరించారు. ఓ ఇంట్రెస్టింగ్ ఇన్సిడెంట్ చుట్టూ అల్లుకున్న కథ ఇదని, ఆద్యంతం అనూహ్య మలుపులతో సాగుతుందని, మేఘాలయా రాష్ట్రంలో చిత్రీకరణ జరిపామని చిత్ర నిర్మాత వేణు దోనేపూడి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అజయ్ అబ్రహం జార్జ్, సంగీతం: స్టీఫెన్, ఆనంద్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: శ్వేత దోనేపూడి, దర్శకత్వం: గుణి మంచికంటి.

## కీర్తి నిజంగా వేరే లెవల్

కీర్తిసురేశ్ తెరపైనే కాదు. రియల్ లైఫ్‌లోనూ షార్ప్‌గా ఉంటారు. తనపై వచ్చే విమర్శలను తిప్పికొట్టడంలో ఆమె శైలి ప్రత్యేకంగా ఉంటుంది. తాజాగా ఆమె నాని హీరోగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో భాగమైంది. ఆ సినిమాలోని ఓ ప్రత్యేక గీతంలో కీర్తి సురేశ్ నర్తించింది. ఈ విషయంపై ఓ యువతి.. అవకాశాలు లేక ఐటమ్ సాంగ్ చేసిందంటూ కీర్తి సురేశ్‌ని విమర్శిస్తూ తన ఇన్‌స్టాలో ఓ వీడియోని షేర్ చేసింది. పైగా 'ది ప్యారడైజ్' సినిమాను కన్నడ సినిమాగా ఆమె ఆ వీడియోలో పేర్కొన్నది. ఈ విమర్శపై కీర్తి సురేశ్ కూల్‌గా తనదైన శైలిలో సమాధానమిచ్చింది. 'ది ప్యారడైజ్'ని కన్నడ సినిమా అనడంపై 'వేరే లెవల్..' అంటూ కీర్తి సైటైర్ విసిరింది. 'చిన్న కరెక్షన్.. నాని నటిస్తున్న తెలుగు సిని మా.. కన్నడ సినిమా కాదు' అంటూ కౌంటరిచ్చింది. అంతే.. సరిగ్గా చెప్పావ్ అన్నట్టుగా పలువురు నెటిజన్లు కీర్తి సురేశ్‌ని అభినందిస్తూ కామెట్లు పెడుతున్నారు.



## ప్రతిరోజూ కొత్తగా ఉంది

అగ్ర నటి సమంత హాలిడే ట్రిప్‌కి రెడీ అవుతున్నారు. తన ప్రెగ్నెన్సీకి చెందిన ప్రతి క్షణాన్నీ ఆస్వాదించేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారామె. ఎప్పుడూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే సామ్.. తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. 'ఈ హాలిడేకు రెండు జతల బట్టలు మాత్రమే సర్దుతున్నా. నిజానికి నా దగ్గర చాలా డ్రెస్సులున్నాయి. కానీ అవేమీ ఇప్పుడు నాకు సరిపోవడం లేదు. అందుకే సరిపోయే రెండు జతలు మాత్రమే సర్దుతున్నా' అంటూ ఆ పోస్టులో పేర్కొన్నది సమంత. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాతృత్వం గురించి సమంత మాట్లాడిన మాటలు కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ' 'అమ్మ' అని పిలిపించుకునే క్షణాలకోసం నేనెంతో పరితపిస్తున్నాను. నా బిడ్డను మోస్తున్నాననే అనుభూతి నా హృదయాన్ని ఆనందంతో నింపేస్తున్నది. ఈ ప్రయాణాన్ని ప్రతి క్షణం ఆస్వాదిస్తున్నా. నాకెందుకో ప్రతిరోజూ కొత్తగా ఉంది' అంటూ సమంత భావోద్వేగానికి లోనయ్యారు.